# కథాకేళి

## ఇంప్పైన జంట

"ఈ సంవత్సరం వూటీలో చలి తక్కువగా వున్నట్లుంది కదండి?" అడిగింది ప్రణయిని సుధామని.

"నేను పక్కనుండబట్టి అలా అనిపిస్తోంది నీకు" నవ్వాడు అతను.

"అదేం కాదు" సిగ్గుపడింది ప్రణయిని.

క్రితం సంవత్సరం కూడా ఆ జంట వూటీకి అదే సమయంలో, అదే హోటల్‌కి వచ్చారు. అదే గదిలో వున్నారు. అప్పుడు కూడా ఆ హోటల్ రిసెప్షనిస్ట్, రూం బాయ్‌లు వాళ్ళని చూసి 'ఎంత ఇంప్పైన జంట' అని ఈర్ష్యపడ్డారు కూడా.

ప్రణయిని! సుధామ!! ఇద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' కాంటెస్ట్‌లో పాల్గొంటే జడ్జిల్లో ఒక్కరు కూడా ఏమాత్రం సందేహించరు. అందరి ఓట్లూ ఆ జంటకే పడతాయి అనిపించేలా వుంటారు. పైగా ఒకరంటే మరొకరికి అంతులేని ప్రేమ. సంవత్సరం గడిచినా వారిద్దరు ఇదివరలోలానే వున్నారు. "ఇంకా వాళ్ళ సంసారంలోంచి కొత్తదనం పోలేదు" అనుకున్నారు హోటల్ స్టాఫ్.

వాళ్ళిద్దరూ కంచరగాడిద లెక్కారు. లేక్‌లో బోటింగ్ చేశారు. చుట్టు పక్కల వున్న టీ గారెన్స్‌కి పిక్‌నిక్‌కి వెళ్ళారు. బొటానికల్ గార్డెన్స్ అంతా నడిచి తిరిగి చూశారు. ఈ లోకాన్నే మరచిపోయి హాయిగా గడపసాగారు.

సుధామ ఓ ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలో ఇంజనీర్ అని గ్రహించాడు రిసెప్షనిస్ట్. ఆ హోటల్‌వాళ్ళు సమ్మర్ వెకేషన్‌లో సంవత్సరానికోసారి నిర్వహించే 'లక్కీ డిప్ ఫర్ కపుల్స్'ని ఆ సంవత్సరం కూడా నిర్వహించారు.

ఏటా ఆ రోజు, హోటల్‌లో వున్న జంటల గదుల తాళం చెవులని ఓ పెట్టెలో వేస్తారు. కేవలం జంటలే ఇందులో పాల్గొనడానికి అర్హులు తప్ప పిల్లా పీచుతో వచ్చినవాళ్ళు పాల్గొనకూడదు. అరవై ఏళ్ళ పైబడ్డ వాళ్ళనుంచి పద్దెనిమిదేళ్ళవారి దాకా ఆ లక్కీ డిప్‌లో పాల్గొనవచ్చు. భార్యా భర్తలై వుండటమే అర్హత. హోటల్ మేనేజర్ ప్రణయిని, సుధామలకి ఆ సంగతి చెప్పగానే "ఓ... క్రితం సంవత్సరం మాకు బహుమతి రాలేదు' చెప్పింది ప్రణయిని.

"ఈసారి లక్ మీవైపుండి వుండచ్చు. ప్రయత్నించండి. రాత్రి ఎనిమిదికి కాన్‌ఫరెన్స్‌హాల్‌కి రావడంమర్చిపోకండి" చెప్పాడు మేనేజర్. వెళ్తూ చెప్పాడు—

"మేడ్ ఫర్ ఈచ్ అదర్ కాంటెస్ట్ అయితే మీరు డెఫినెట్‌గా గెలుస్తారు."

అతను వెళ్ళగానే ఇద్దరూ ఆనందంగా నవ్వుకున్నారు. తమని చూసి ఆ మాట చెప్పేవాళ్ళే ఎక్కువ. ప్రణయినిని దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకుని చెప్పాడు సుధామ.—

"గుడ్‌లక్ టు అజ్"



ఆ రాత్రి దాదాపు పాతిక జంటలు ఆ కాన్‌ఫరెన్స్ హాల్‌లో చేరాయి. అందరి గదుల తాళం చెవులు తీసుకుని ఓ పెట్టెలో వేశారు. వాటిని బాగా కలిపాక అక్కడ షూటింగ్‌కి వచ్చిన ఓ సినీ నటిచేత ఓ తాళం చెవిని తీయించారు.

ఆ గది నెంబరు చూసి పిలిచారు మైక్‌లో.

"మిస్టర్ అండ్ మిసెస్ ధమరకనాథ్" హోటల్ మేనేజర్ వాళ్ళిద్దరూ బహుమతి తీసుకుంటుండగా చెప్పాడు—

"లక్ వాళ్ళ పక్షాన వున్నట్టుంది ఇవాళే మన హోటల్‌కి వచ్చారు!"

ధమరకనాథ్ అయిదు వందల పదహారు రూపాయిల పర్స్ అందుకున్నాక చప్పట్లు కొట్టారు మిగతా వాళ్ళు ఒక్క ప్రణయిని తప్ప.

ధమరకనాథ్ ప్రణయిని వంక చూశాడు. ఆమె అతని వంక చూస్తోంది. ఇద్దరిలో క్షణకాలం ఆశ్చర్యం, వులికిపాటు ఒకరితో మరొకరికి పరిచయం వున్న భావన. తర్వాత ఇద్దరూ మామూలైపోయారు.

అందరితోపాటు ప్రణయిని, సుధామ కూడా బహుమతి పొందిన జంటని అభినందించారు. మరో వారం వుండాలనుకుని వచ్చిన ధమరకనాథ్, ఇంకో నాలుగు రోజులుండాల్సిన ప్రణయిని, సుధామ జంట కూడా ఆ హోటల్‌ని ఖాళీ చేసి వెళ్ళిపోయారు. ఈ సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత వైజాగ్‌లోని సీతమ్మధారలోని ఓ ఇంట్లో—

"నేను పెద్దగా అరవదలచు కోలేదు. నే చేసిన తప్పే నువ్వూ చేశావు. కాని ఇకమీదట నేను ప్రతి వేసవి కాలం పది రోజులపాటు కలకత్తాకి 'ఆఫీస్ కేంప్'కి వెళ్ళను. అలాగే నీవు ఆ పది రోజులు పిల్లల్ని మీ అమ్మగారింట్లో వదిలి 'మీ అక్కయ్య ఇంటికి' వెళ్ళకు" చెప్పాడు ధమరకనాథ్‌తన భార్య ప్రణయినితో.

"అలాగే ఇక వెళ్ళను — మీ మీద ఒట్టు" చెప్పింది ధమరకనాథ్ భార్య ప్రణయిని తల వంచుకుని.

**మల్లాది వెంకటకృష్ణమూర్తి**